
# కడుపు నిండింది

-ఆదిరెడ్డి మావుళ్ళు

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ



ఇల్లంతా ఒకటే సందడి. అప్పుడే పండగ కళ వచ్చేసింది ఆ యింట్లో బంధువులు... చుట్టాల రాకతో.

"హమ్మయ్యా... యిన్నాళ్ళకు మేం గుర్తుకొచ్చామన్న మాట. పోనీలెండి యిప్పటికయినా మీకు మా మీద దయకలిగింది..." జానకమ్మ ఆనందాశృవుల్ని కళ్ళనుండి జాలువారుస్తూ అంది అందరినీ ఆప్యాయంగా హత్తుకుని.

"అమ్మమ్మా... నాన్నమ్మా" అని ముద్దుగా పిలుస్తూ పిల్లలు జానకమ్మ ఒడిలోకి చేరి ఒకటే హడావుడి చేసేస్తున్నారు. జానకమ్మ ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. అది గమనించిన రామయ్య "ఒరేయ్ పిల్లకాయలూ! ఇలా నా దగ్గరకు రండ్రా..." అంటూ చేతులు చాచగానే వాళ్ళ దృష్టి సోఫాలో కూర్చున్న తాతయ్య వైపు పడింది. మరు క్షణం వాళ్ళంతా రామయ్య దగ్గరకు పరుగెత్తుకొచ్చి చుట్టుముట్టేశారు.

"అమ్మా నాన్నా... బాగున్నారా?!" అంటూ కొడుకులూ...

"అత్తయ్యగారూ... మావయ్య గారూ..." అని అల్లుళ్ళూ కోడళ్ళూ...

ఆప్యాయపు పలకరింపులూ... కుశల పలుకులు.

ఒకరా... యిద్దరా...! అంతాకలిపి పాతిక మందికి పైనే.

అందర్నీ ఒకేసారి చూసేసరికి ఆ వృద్ధ దంపతుల ఆనందం అవధులు దాటిపోయింది.

వాళ్ళను చూసి మూడేళ్ళయింది. అంతకుముందు తమకు తామే పనికట్టుకుని ప్రతీ ఏడాది వెళ్ళి వచ్చేవారు జానకమ్మ రామయ్య. ఇప్పుడు వయసు మరీ మీద పడడంవల్ల... ఏవేవో జబ్బులు శరీరాలను కృంగదీయడం వలనా ప్రయాణాలు చేసే ఓపిక పోయింది వారిలో.

గడచిన మూడేళ్ళలో ఎన్నోసార్లు భర్తకు చెప్పింది.

"ఏఁవండీ! వాళ్ళని చూడాలనుందండీ...!"

"అలాగే లేవోయ్...!"అని సన్నని నవ్వు ముఖంపెట్టి భార్యను సముదాయించేడు రామయ్య.

"మూడేళ్ళనుంచీ అదే సమాధానం! ఈ సంక్రాంతికైనా అందరూ వచ్చేలా చెయ్యండి" అంది జానకమ్మ ఆర్తిగా భర్త ముఖంలోకి చూసి.

"నేనేం చెయ్యను జానకి? వాళ్ళని రమ్మని పిలవడం... కబురంపడం... లేదా ఫోన్ చెయ్యడం... అంతగా అవసరం అయితే ఉత్తరాలు రాయడం... అప్పటికీ రాకపోతే నేనే స్వయంగా వెళ్ళి చెప్పడం...!

అంతకు మించి నేను చెయ్యగలిగేదేముంది? రావడం... రాకపోవడం వాళ్ళ పని. బలవంతంగా రెక్కలు పట్టుకుని లాక్కుని రాగలనా?!" అయినా వాళ్ళ సమస్యలు వాళ్ళకుంటాయి కదా! పైగా వాళ్ళుండేది పొరుగూర్లోనో... జిల్లాల్లోనూ కాదే!

"కన్నవాళ్ళం! ఆఖరి దశలో వున్న వాళ్ళం... మనకంటే ముఖ్యమైనవా వాళ్ళ పనులు...?!"అని నిలదీస్తూ అడిగింది జానకమ్మ భర్తని.

రామయ్య నీళ్ళు నములుతూ మౌనంగా వుండిపోయేడు.

"అయినా ఎప్పటిలాగా నా ప్రయత్నాలు నేను చేస్తానులే" అని భరోసా యిచ్చేడు భార్యని సంతృప్తిపర్చడానికి.

"ఏమో?! మీరేం చేస్తారో...! ఈ పండక్కి వాళ్ళంతా వచ్చి తీరాల్సిందే...!"అంటూ పండక్కి నెలముందు నుంచీ పట్టుబట్టింది జానకమ్మ.

ఆఖరికి ఆమె కోరిక తీరింది.

అందరూ ఒకరితర్వాత ఒకరు వరసగా వచ్చేరు ఎక్కడెక్కడినుంచో- జిల్లాల ఎల్లలూ... రాష్ట్రాల సరిహద్దులూ దాటి. పెద్దకొడుకు అయితే భార్యాబిడ్డలతో సహా వచ్చేడు అమెరికానుంచి వేల మైళ్ళు ప్రయాణం చేసి.

ఇద్దరు కొడుకులూ కోడళ్ళూ... ముగ్గురు కూతుళ్ళూ అల్లుళ్ళూ...

ఇంకా మనవళ్ళూ మనవరాళ్ళూ... చుట్టాలూ బంధువులూ... అంతా కలిసి యిరవై మందికి పైనే.

అందర్నీ ఒకేసారి చూడడంతో జానకమ్మ మనసు ఆనందపారవశ్యంలో పడిపోయింది. జానకమ్మ అసలే గుండె జబ్బు మనిషి. ఆ ఆరాటంలో భార్యకు ఏ క్షణాన ఏమవుతుందోనన్న భయాందోళనలు రామయ్యను పట్టి పీడించసాగేయి.

"మరీ ఎక్కువగా ఉద్రేక పడకోయ్...! గుండె జబ్బున్న వాళ్ళు ఏదీ అతిగా చెయ్యకూడదని డాక్టర్లు చెప్పలేదూ...?" అన్నాడు రామయ్య భార్యను హెచ్చరిస్తూ.

"హబ్బా! ఈ శుభ సందర్భంలో జబ్బులూ... డాక్టర్లూ అంటూ ఆ మాటలేంటి?! మీకెప్పుడేం మాట్లాడాలో అస్సలు తెలియదు. అంతగా అవసరం అయితే మనింట్లోనే డాక్టరున్నాడు" అంటూ పెద్దకొడుకు వైపు చూసింది జానకమ్మ.

"చెయ్యి దాటిపోతే నీ కొడుకే కాదు- ఆ దేవుడు కూడా ఏమీ చేయలేడు" అన్నాడు రామయ్య.

"అవునమ్మా! నాన్న చెప్పిందే కరెక్ట్!" అన్నాడు శంకరం.

"నువ్వు మరీన్రా! ప్రతి దానికి మీ నాన్నకి వంత పాడుతావు" అని జానకమ్మ పెద్దకొడుకు శంకరాన్ని గదమాయిస్తూ "ఐనా మీ అందరి సమక్షంలో చనిపోయే అదృష్టం నాకుండొద్దూ!?"అంది జానకమ్మ మురిసిపోతూ.

"జానకీ?!" అంటూ రామయ్య భార్య ముఖంలోకి చూసేడు ఆవేదనగా. శంకరంతోపాటు అక్కడున్న వాళ్ళంతా అదోలా ముఖం పెట్టేరు.

కూతుళ్ళు ఆ మాటలకు రియాక్టై ఏదో చెప్పబోతుండగా జానకమ్మ అడ్డుపడి "ఇక చాలు! ఆ విషయం అటుంచి ముందు యిది చెప్పండి" అంది జానకమ్మ అందరినీ ఉద్దేశించి.

అంతా ఏమిటన్నట్టు చూసేరు ఆసక్తిగా.

"మీలో ఎవరికి ఏ స్వీటు కావాలో చెప్పండి"అంటూ కలం కాగితం పట్టుకుంది జానకమ్మ. ఆమెకు వాళ్ల యిష్టాయిష్టాలు తెలుసును. ఐనా అడిగింది. పిల్లలూ పెద్దలూ అందరూ వరసగా తమకిష్టమైనవి చెప్పేరు.

అవన్నీ రాసి లిస్ట్ తయారుచేసి "ఇవన్నీ తెప్పించే బాధ్యత మీది"అంది జానకమ్మ భర్తకు లిస్ట్ యిస్తూ.

రామయ్య గంటలో అవన్నీ సిద్ధం చేశాడు.

''అన్నీ తెచ్చారు. కాని మీకు నాకూ యిష్టమైనవేవి?!'' అని అడిగింది జానకమ్మ ఆ పొట్లాలు విప్పి చూసి.

''మనం తీపి తినే యోగాన్ని భగవంతుడెప్పుడో లాగేసుకున్నాడు కదా!'' ఇద్దరూ మధుమేహ వ్యాధిగ్రస్తులు. తీపిని రుచి చూసి చాలా ఏళ్ళయింది.

''ఏనా ఒక్కసారి! ఏదో కాస్త తీపిని తింటే ప్రాణాలేం పోవులెండి''అంది మొండిగా.

''డాక్టర్లు చెప్పింది మర్చిపోకూడదు''అన్నాడు రామయ్య.

'అవునమ్మా' అన్నట్టు చూసేడు డా.శంకరం తల్లి ముఖంలోకి చూసి ''ఇంక మీరేం చెప్పకండి నాకు! నేను చెప్పినట్టు చెయ్యండి'' అని జానకమ్మ భర్తకు హుకుం జారీచేసింది.

రామయ్యకు మళ్ళీ బయటికెళ్ళే పని తప్పలేదు.

తనకిష్టమైన మైసూర్ పాక్ భార్యకిష్టమైన జిలేబికి కావలసిన సరుకులు తీసుకొచ్చి ఆమె ముందుంచేడు.

''అన్నట్టు వంటమనిషింకా రాలేదేంటి?!'' అడిగేడు రామయ్య.

''నేనే పొమ్మన్నాను! సాయంత్రం కనబడమన్నాను'' చెప్పింది జానకమ్మ.

''అంటే! ఈ వంటలన్నీ నువ్వే చేస్తావా?!'' అడిగేడు రామయ్య ఆశ్చర్యంగా ముఖం పెట్టి.

''ఏం! నాకు చేతకాదనుకున్నారా?!''అంటూ వంట పనికి సమాయత్తమయింది జానకమ్మ.

''నీకెందుకమ్మా ఆ శ్రమ! మేం చేస్తాం...''అని ముందుకు రాబోయిన కూతుళ్ళని వారించింది.

ఆఖరికి కోడళ్ళని సైతం చెయ్యి పెట్టనివ్వలేదు జానకమ్మ. తన చేత్తో స్వయంగా చేసిన వంటకాలను వొండి పెట్టాలని ఆమె దృఢమైన కోరిక. ఆ ప్రకారమే చేసింది.

అందరికీ యిష్టమైన వాటితోపాటు తమకిష్టమైనవి కూడా తయారుచేసింది.

అందరికీ స్వయంగా వొడ్డించింది జానకమ్మ.

పిల్లలు అడిగినంత... తిన్నంత పెట్టింది. మిగతా వాళ్ళకి కొసరి కొసరి వడ్డించింది- వొద్దని వారించినా వినకుండా.

వాళ్ళు సుష్టుగా తిని లేచిపోయేరు.

ఎవరి ఆటపాటల్లో వాళ్ళు మళ్ళీ నిమగ్నమై పోయేరు.

కొందరూ భుక్తాయాసంతో కునుకుతీసారు.

అందరూ తినగా మిగిలిన వంటకాలు పనిమనిషొచ్చి తీసుకుపోయింది.

''అదేంటి! మనకిష్టమైనవంటూ చేసిన స్వీట్లు కూడా వాళ్ళకే పెట్టేశావు?'' ఆ రాత్రి నిద్రపోయే సమయంలో రామయ్య భార్యతో అన్నాడు. ''నువ్వు తినవా?!'' ఆశ్చర్యంగా చూసేడు.

''నేనెప్పుడో తినేశానండి!''అని చెప్పి నవ్వింది సన్నగా జానకమ్మ.

భార్య మాటలకు రామయ్య తృళ్ళిపడ్డాడు.

భార్య జిహ్వా చాపల్యం రామయ్యకు బాగా తెలుసు.

జిలేబీలంటే జానకమ్మ పడి ఛస్తుంది. ఎంత యిష్టమంటే- ఒకేసారి అరకేజీ లాగించెయ్యగలదు.

అందుకే ఓ కంట కనిపెడుతూనే వున్నాడు రామయ్య.

అతిగా తిని ఎక్కడ జబ్బు ముదుర్చుకుంటుందోనని ఆయన భయం.

"చూడండి! మనకిష్టమైన స్వీట్లు కూడా చేసింది మనం తినడానికి కాదండి! వాళ్ళు తింటుంటే చూసి ఆనందించడానికి అందరూ ఎవరికిష్టమైనవి వాళ్ళు తినడమేకాక మనకిష్టమైనవి కూడా తింటున్నపుడు మీలో కలిగిన సంతృప్తే నాలోనూ కలిగింది.



''ఎప్పుడు తిన్నావు జానకి?!'' అడిగేడు రామయ్య ఆత్రంగా. తీపి పదార్థాలు అస్సలు ముట్టకూడదని డాక్టర్లు మరి మరీ హెచ్చరించిన సంగతి రామయ్యకు బాగా గుర్తుంది.

''నేనే కాదు! మీరు కూడా తిన్నారు'' అంది జానకమ్మ నవ్వుతూ.

రామయ్య యీసారి మరీ ఆశ్చర్యపోయేడు.

తనకు మైసూర్‌పాక్ యిష్టమే అయినా ఎప్పుడో నోరు కట్టేసుకున్నాడు. అసలు తీపి తిని చాలా ఏళ్ళే అవుతోంది.

''నేను తిన్నానా? ఎప్పుడు జానకి!'' భార్య మాటలు రామయ్యకు చాలా వింతగా అనిపిస్తున్నాయి. తనకు చాటుగా అవకాశం చూసుకుని వండేటప్పుడు తింటే తినొచ్చు.

కానీ అస్సలు ఆ స్వీట్లకేసి చూడనైనా చూడని తనను తిన్నాననడం ఏమిటి? అంతా అయోమయంగా వుంది రామయ్యకి.

అంతుబట్టక అదోలా ముఖం పెట్టేడు రామయ్య.

భర్త మనసులో చెలరేగుతున్న భావాలను యిట్టే పసిగట్టగల జానకమ్మ అప్పుడు చెప్పింది నెమ్మదిగా.

''చూడండి! మనకిష్టమైన స్వీట్లు కూడా చేసింది మనం తినడానికి కాదండి! వాళ్ళు తింటుంటే చూసి ఆనందించడానికి అందరూ ఎవరికిష్టమైనవి వాళ్ళు తినడమేకాక మనకిష్టమైనవి కూడా తింటున్నపుడు మీలో కలిగిన సంతృప్తే నాలోనూ కలిగింది. ఆ సమయంలో మీ ముఖంలోని ఆనందాన్ని కళ్ళల్లోని సంతృప్తిని నేను గమనించలేదనుకున్నారా?!''

''అవును జానకి. నువ్వు చెప్పింది నిజమే. ఆ క్షణాల్లో నేను పొందిన తృప్తి అంతాయింతా కాదు. నేనే తిన్నంతగా అనిపించి కడుపునిండిపోయింది. అందుకే భోజనం కూడా చేయాలనిపించలేదు. గ్లాసుడు పాలు మాత్రమే తీసుకున్నాను తినాలన్న ఆకలి లేకపోవడం వల్ల'' అన్నాడు రామయ్య భార్యతో.

''అదిగో! అలాంటి పరిస్థితే నాలోనూ కలిగింది. వాళ్ళు తింటే నేనే తిన్నంత తృప్తి కలిగింది. అది చాలు అంటూ గ్లాసుడు మంచినీళ్ళు తాగి పడుకున్న భార్య ముఖంలోకి తదేక దృష్టితోచూస్తూ వుండిపోయేడు రామయ్య.

అనురాగం ఆప్యాయతలు నిండిన మనసులలో ఆకలికి చోటుండదన్న సత్యం రామయ్యకి తెలిసిరావడం జీవితంలో అది ఎన్నోసారో ఆయనకే తెలియదు. ఒక వేళ ఏదైనా ఆకలి గనక వుంటే అది కేవలం భౌతికావసరమే తప్ప మానసికమైనది కానే కాదు. ★

---

## మోనాలిసాను మించిన

# మరో వర్ణ చిత్రం!

ఇంతవరకూ ప్రపంచంలోని అతి గొప్ప వర్ణ చిత్రాలలో, మోనాలిసా చిత్రం అత్యున్నత స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఆ మహత్తర కళాఖండాన్ని అద్భుతంగా చిత్రించి, నాటినుంచీ నేటివరకూ కళాభిమానుల మన్ననలు పొందుతున్నవి విఖ్యాత చిత్రకారుడు- లియోనార్డో డావెన్సీ! ఈమధ్య ఆ అపురూపమైన కళాఖండాన్ని మించిన మరో వర్ణ చిత్రం వెలుగులోకి వచ్చింది. ఆ చిత్రాన్ని నయనానందకరంగా చిత్రించిన చిత్రకారుడు కూడా డావిన్సీయే. ఆ రంగుల సజీవ స్వప్నం పేర మేరీ మాగ్దలేనీ! చిత్రకళారంగంలోని కళాకోవిదులు అందరూ ఆ వర్ణ చిత్రంలోని కళా కౌశలాన్నీ, రంగులను అతి సుందరంగా తీర్చిదిద్దిన తీరును, చిత్రకారుని కుంచె యొక్క సొగసులు, లాలిత్యం వీక్షించి- ఆ చిత్రం డావిన్సీదేనని నిర్ణయించారు. ఈ కళాఖండం అతి త్వరలో ప్రేక్షకుల ముందు ఆవిష్కరించబడుతోంది. ఆ పెయింటింగ్ పొడవు 58 సెం.మీ. వెడల్పు 45 సెం.మీ. ఆ చిత్రం 1515లో చిత్రించబడిందనీ, తన మరణానికి నాల్గు సంవత్సరాలు ముందు డావెన్సీ దానిని



రూపొందించాడని కళాకోవిదులు భావిస్తున్నారు. సుందరి మాగ్దలేనీ ఎర్రటి రోబ్ ధరించి, అతి పల్చటి ముసుగు ధరించినట్లుగా డావెన్సీ చిత్రించాడు. సుమారు 100 సంవత్సరాలుగా ఆ కళాఖండం ప్రైవేట్ కలక్షన్లలో ఉన్నదని కొందరు కళాప్రవీణులు అన్నారు. వియన్నాలో 1920లో ఆ చిత్రంయొక్క నలుపు తెలుపు ఫొటో తియ్యడం జరిగింది.

ఆ మహాద్భుత కళాఖండాన్ని స్వంతం చేసుకొనడానికి ఎందరో కోటీశ్వరులు ఉవ్విళ్లూరుతున్నారు. ఆ సుందరమైన వర్ణ చిత్రానికి ఖరీదు కట్టే షరాబు లేడు అని చిత్ర కళలో నిష్ణాతులైన పండితులు అన్నారు.

ఎందరెందరో పారిశ్రామికవేత్తలు, కోటీశ్వరులు అత్యంత ఖరీదైన వర్ణ చిత్రాలను కొని తమ భవంతులలో ముచ్చటగా అలంకరించుకొని ఆనందించే శ్రీమంతులు- అజ్ఞాతంగా, ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలకు ఆ వర్ణ చిత్రం గురించి ఫోన్లు చేస్తున్నారు. అది వేలం పాటకు వస్తే, కొని స్వంత చేసుకొనడానికి! ఆ అద్భుత కళాఖండం ఆవిష్కరణకోసం ఎదురు చూద్దాం!

-కొడిమెల